


# 'ముక్కు' సూటితనం

భూపాల్

**'ముఖానికి ముక్కు అందం' అన్న వాళ్లంతా ఏ ముఖానికి ఎలాంటి ముక్కు అందమో చెప్పారు కాదు. పద్మజకు ముక్కు కారణంగా సంబంధాలు కుదరకున్నాయి. మొన్న నాల్గు రోజుల క్రితం పెళ్లి చూపులకని వచ్చిన రామానుజశాస్త్రికి అమ్మాయి నచ్చలేదని ఈ ఉదయమే ఓ దూరపు బంధువు వచ్చి చెప్పి వెళ్ళాడు.**

ఆ వార్త విన్న తల్లి అప్పటి నుండే దండకం ప్రారంభించింది. "ముదనష్టపు ముండ, దరిద్రం గొట్టుది. ఏడుపు ముఖంది. ఏజన్మ పాపం వల్ల నా కడుపున పుట్టిందో! దాని పెళ్లి కానిదే, మిగతా ఇద్దరికి ఎవరొస్తారూ? దాని ముక్కు చూస్తూ వచ్చిన వరుడు మూడు ఆమడల దూరం పారిపోతున్నాడాయే! ఈ పీడ ఎప్పుడు విరగడౌద్దో!" అంటూంది.

వరండాలో పుస్తకాల షల్ఫ్ దగ్గర ఏదో పుస్తకం వెదుకుతున్న పద్మజ తల్లి దిక్కు చూసింది. తల్లి వంట గదిలో మడి బట్టలు కట్టుకొని వంట చేస్తోంది. కాళ్లకూ, ముఖానికీ పసుపు నిండుగా వుంది. తలంటుకున్న నీటి చుక్కలు ఒక్కొక్కటి కురులతో బాటు ముడేసిన తుండుగుడ్డను తడిపి వీపున జాకెట్ మీద రాలుతున్నాయి. పక్కనుండి సగం ముఖమే కనిపిస్తున్నా ఆ ముఖం మీద ఎర్రని కుంకుంబొట్టు విసుక్కుంటున్న ముఖానికి వికారంగా కనిపిస్తోంది.

ఏ కారణం వల్ల వరుడు తనన నచ్చలేదో ఆ క్షణంలో ఆమెకు తెలియదు. ఇప్పుడు ఆ తిట్లు తనను గూర్చేనని మాత్రం అర్థమైంది. పద్మజ సూటితనం, బ్రాహ్మణ కుటుంబ కట్టుబాట్ల వ్యతిరేకత, హేతువాద తత్వం... ఇవి తల్లితండ్రులకు నచ్చవు. తను ముగ్గురమ్మాయిల్లో పెద్దమ్మాయి. తన చెల్లెళ్లిద్దరూ పెళ్లికెదిగి వున్నారు. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. తనూ ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా వుంది.

అన్నయ్య వున్నా వాడు ఓ ఆరుమాసాలకోమారుగానీ ఇంటి వైపు రాడు. తనకు నచ్చిన కులం తక్కువ పిల్లను పెళ్లి చేసుకొని ఉడాయించాడు. ఇల్లు వదిలేశాడు. బాధ్యతలు మరిచాడు. వాడు అలా తక్కువ కులం పిల్లను చేసుకోవటంలో ప్రోత్సాహం పద్మజది కూడా వుందని తల్లి తండ్రుల అనుమానం. తండ్రి ఓ గుడిలో పూజారి.

పద్మజ పెళ్లి చేస్తేనే కాని, మిగతా ఇద్దరి వివాహాలు కావు. అందుకు పది పదిహేను సంబంధాలు చూసినా రకరకాల కారణాల వల్ల వద్దని వెళ్లిపోయారు. అందులో ప్రధానం కారణం ముక్కు కొందరికి నచ్చలేదని తెలిసింది.

పద్మజకి ఈ రోజు టిఫిన్ చేయబుద్ధేయలేదు. స్కూల్‌కి సిద్ధమై బయలుదేరుతోంటే ...చిన్న చెల్లి వనజ వచ్చి "అక్కా! అమ్మ తిని వెళ్లమంటోంది" అంది.

"ఏం రోగమే ఉదయమే మళ్లీ పంచాంగం విప్పిందీ?" అని అడిగింది పద్మజ.

"వాడెవ్వడో వచ్చాడే నిన్ను చూడ్డానికి వాడికి నీ ముక్కు నచ్చలేదట. ఆ వార్త తెలిసింది అందుకే."

"చూడే! నా ముక్కూ, మూతీ నచ్చకపోవడానికి కారణం నేను కాదు. నన్ను కన్న తల్లి తండ్రులే. కాకి పిల్ల కాకికి ముద్దంటారు. ఇదెక్కడి తల్లే నన్ను సాధిస్తుందీ. డబ్బుంటే, దమ్ములుంటే ప్లాస్టిక్ సర్జరీ చేయించి బాగు చేయించాలి కానీ, నన్ను వెక్కిరిస్తూ నా మనస్సు పాడు చేయొద్దు. నేనేం నేరం చేశాననీ నాకీ శిక్ష. ఆమె అన్నట్టుగా పూజలు చేస్తే ఎవడో వచ్చి నన్ను చేసుకుంటాడన్న నమ్మకం నాకు లేదు. ఐనా పెళ్లి నాకు వద్దని చెప్పాగా! నా గొడవ వదిలేసి మీ పెళ్లిళ్లు చేస్తే ఏం? ఐనా నన్ను తిట్టేం లాభమే? నన్ను ఇలా కన్నది తాను. ఆమాత్రం ఇంగిత జ్ఞానం లేదు. నే చావనా?..." పద్మజ కళ్లలో నీళ్లు. లోన బాధ.

సుమారు సంవత్సరం క్రితం వరలక్ష్మీ వ్రతం నీవు చేసి తీరాలని తల్లి పద్మజను గట్టిగా పురమాయించింది. నాకు నిజంగా ఈ వ్రతాలూ, పూజల మీద నమ్మకం లేదు. చేసుకుంటే మీ ఇష్టం. నేను మాత్రం చేయనని మొండికేసింది పద్మజ. ఆ గొడవ ఇద్దరి మధ్యనా పెరిగి పెరిగీ అంత వయస్సున్న కూతుర్ని కొట్టింది తల్లి. వాతలు పెడతానంది. అదిగో అప్పటినుండీ తల్లీ, కూతుళ్లకు మాటలు సరిగా లేవు. తల్లి ఎంత సాధిస్తుందో కూతురంత మొండికేస్తుంది. అందుకే ఏ వంక దొరికినా పద్మజకు చీవాట్లు తప్పవు.

పద్మజ ఏమీ తినకుండా స్కూలుకి వెళ్లిపోయింది. రోజులాగే స్కూలుగేటు దగ్గర ఎల్లల్ని వదిలేస్తూ ఆటో రిక్షా మల్లేష్ కనిపించాడు. అతను ఎప్పుడూ పద్మజ వైపు చూస్తూ వుంటాడు. నవ్వుతుంటాడు. ఆ నవ్వులో చిలిపితనం, వెటకారం, అసహ్యం కనిపించవు. పద్మజ కూడా తనూ, తన మూడ్‌ని బట్టి చిన్న మందహాసం చేస్తూ వెళ్లి పోతుంది తరుచు. ఈ రోజు ఎందుకో నవ్వడమే కాకుండా 'నమస్తే' టీచర్ అని కూడా అన్నాడు. అతనేదో చనువు పెంచుకునే దారిలో వున్నాడని పద్మజకు తెలుస్తోంది. తనను చూసి రోజూ అలా ఎందుకు నవ్వుతాడో అడగాలని చాలా రోజులనుండి అనుకుంటున్నది తను. ఈ రోజూ అదే అడిగింది.

"మీ ముక్కు చూస్తే నవ్వొస్తుంది టీచర్.

మళ్ల చూడాలనిపిస్తోంది" అన్నాడు సూటిగా.

"అంత వింతగా నవ్వొచ్చేట్టుగా వుందా నా ముక్కు?"

"కాదు.నా కెందుకో మంచిగనిపిస్తుంది. మీ కండ్లకు మీ ముక్కు సరిగ్గా సరిపోయింది"

"నిజమా?"

అతను తలూపాడు.

"నీకు పెళ్లయిందా?" అడిగింది పద్మజ.

అతనొక్క క్షణం విస్తుపోయి "కాలేదు" అన్నాడు.

"నేనూ, నా ఉద్యోగం, నా ముక్కూ, నా కళ్లూ నచ్చితే మరి నన్ను పెళ్లి చేసుకోరాదూ?" సూటిగా అడిగేసింది పద్మజ.

అతను అవాక్కయ్యాడు. అర నిమిషం తర్వాత "మేం గొల్లలం. మీరు బ్రాహ్మణులు. మీ కిష్టమైతే నాకు శాన సంతోషమే" అన్నాడు కొంచెం బిడియపడుతూనే.

పద్మజ నవ్వుతూ స్కూల్లోకి వెళ్లిపోయింది. మల్లేష్‌ని సుమారు సంవత్సర కాలంగా చూస్తూంది తను. రోజూ తనకన్నా ముందే స్కూల్ దగ్గరకి వచ్చి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందుకు తనను గమనిస్తున్నాడ



నిపించేది పద్మజకు. ఈ రోజు ఇంత సూటిగా ఇలా అడుగుతానని తానే న్నడూ అనుకోలేదు.

మల్లేష్ మరోగంట వరకూ నిలబడ్డ చోటినుండి నుండి కదల్లేదు. తాను విన్నదీ, తనకూ టీచర్‌కీ మధ్యలో జరిగిన సంభాషణా నిజమా? కాదా? అన్న అనుమానంతో ఉన్నాడు. టీచర్ జోక్ చేయలేదుగా! అనుకున్నాడు.ఆ తర్వాత నెలరోజులు గడిచాయి. ఒక సాయంత్రం పద్మజ వాళ్ల ఇంటి ముందు ఆటో ఆగింది. ఆటోలో వుండి ఎవరు దిగుతారోనని తల్లి గడపలో నిలబడి చూడసాగింది. ఆటో డ్రైవర్ నేరుగా వచ్చి "పద్మజ టీచర్ తల్లిగారు మీరేనా?" అని అడిగాడు. ఆమె "ఔ"నంది.

"నా పేరు ఆటో మల్లేష్. ఈ కాగితం మీకు ఇచ్చి రమ్మని పద్మజ టీచర్ నన్ను పంపించింది" అని చేతికిచ్చేసి వెనక్కి వచ్చి ఆటో స్టార్ట్ చేసుకొని వెళ్లిపోయాడు.

**"అమ్మా! ఇక నన్ను మన్నించినా శాపనార్థాలు పెట్టినా మీ ఇష్టం. నా ముక్కును ప్రేమించి, నన్నూ ఆరాధించే వ్యక్తి ఈ మల్లేష్. ఇక నుండి ఇతని తోనే నా జీవితం ముడివడి వుంటుంది. నేనూ, మల్లేష్ పెళ్లి చేసుకోబోతున్నాం. మీకు బాధ కలిగితే మన్నించండి. ఎవరైనా, ఎప్పుడైనా నన్ను చూడాలనుకుంటే ఈ అడ్రసుకు రండి. గొడవ చేస్తే లాభం లేదు.**

**ఉంటాను.**
**మీ పెద్ద కూతురు**
**పద్మజ**

**ఉత్తరం చివర్లో అడ్రసు రాసి వుంది.**

***(ఆరవ పేజీ తరువాయి, సినీభేతాళం)***

ఆశ్చర్యంగావుంది ఆనందకుమార్‌కు. వాళ్ల ఇరవైఏళ్ల వైవాహిక జీవితంలో ఆనంద వాణి మొహం చూడకుండా అతను నిద్ర లేవటం ఇదే మొదటిసారి. ఆ బాధను ఎలాగో దిగమింగి, త్వరత్వరగా రెడీ అయ్యాడు. వీధిలో కోలాహలం. ఒకవైపు తోటితారలు, అభిమానులు! మరోవైపు పార్టీ జనం. అందరికీ ఈ వింత ఆశ్చర్యకరమే అయినా ఎవరూ చేసింది ఏమీలేదు. నామినేషన్ల ఘట్టానికి రెడీ అవుతున్నాడు ఆనందకుమార్. ఆనందకుమార్ మనసు పరిపరివిధాలా ఆలోచిస్తున్నా, తాను నటించిన రెండు వందల సినిమాల్లో ఇలాంటి షాకులు, బ్రేకులువున్న సీన్లు చాలాచాలా అదరగొట్టాడు గనుక- నిజజీవితంలోని ఈ సీనులో కూడా ఎలాగో తేరుకుని, నామినేషన్ల ఘట్టానికి వెళ్లేందుకు ఆనందవాణి తోడులేకుండానే వీధిలోకి వచ్చి ఒకసారి సింహావలోకనం చేశాడు. అభిమానులు నటీ నటవర్గం, ఇసుకవేస్తే రాలని జనం! ఒకవైపు పూలదండలు రాసులు రాసులుగా పడుతున్నాయి. మరోవైపు బాణసంచా ఆకాశాన్ని ముద్దెట్టుకుంటోంది.

ఇంతకోలాహలం మధ్యలోంచి జనాన్ని తోసుకుంటూ మెరుపు తీగలా వచ్చింది ఆనందవాణి. ఆనందకుమార్ కాళ్లకు సాష్టాంగపడి దండప్రమాణం చేసి, చేతికి పసుపురాసిన అక్షింతలు ఇచ్చింది. ఆశీర్వదించ వలసిందిగా ప్రాధేయపడింది. ప్రతి పక్షాలు ఆనందవాణికి జై కొట్టాయి.

"నన్ను క్షమించండి. నేనుకూడా ఇదే నియోజకవర్గంలో మీకు ప్రత్యర్థిగా నిలబడుతున్నాను. నామినేషన్ వేయడానికి వెళుతున్నాను. భగవంతుడికన్నా మహాత్ముడైన మీకు నమస్కారం చేసుకుని మీ ఆశీస్సులు తీసుకుని వెళదామని వచ్చాను." అంటూ ప్రాధేయపడింది. అపోజిషన్ పార్టీవారి ఆనందానికి హద్దుల్లేవు.

ఆనందకుమార్ మొదట్లో షాక్ తిన్నా, ఆ షాక్‌లోంచి క్షణాలమీద తేరుకుని నిండు మనస్సుతో ఆనందవాణిని ఆశీర్వదించాడు. భర్త ఆశీర్వాదం అందుకున్న ఆనందవాణి, ఆమె పార్టీవాళ్లు, అభిమానులు, హంగు జనం ఊరేగింపుగా తరలి వెళ్లారు నామినేషన్లకు.

ఓ అరగంట అయ్యాక ఆ ఊరేగింపు వెనుకనే ఆనందకుమార్ వూరేగింపుకూడా రంగరంగ వైభవంగా నామినేషన్లకు తరలివెళ్లింది. హీరోహీరోయిన్లు-ప్రత్యర్థులుగా అక్కడ కలిసినా ఎవరి పనివారిది, ఎవరి నామినేషన్‌ను వారే వేశారు. ఎవరి జనం వారికి బ్రహ్మరథం పట్టారు. అభ్యర్థులు స్థిమిత పద్ధారేగాని, బొత్తిగా అయోమయంలోంచి తేరుకోలేకపోయింది పత్రికలవాళ్లే."-

ఈ కథను ఎంతో ఉత్కంఠతతో చెప్పాడు భేతాళుడు.

"మహారాజా విక్రమార్కా! ఇరవై సంవత్సరాలపాటు ఏ పొరపొచ్చాలూ లేకుండా చిలుకా గోరింకల్లా కాపురం చేస్తున్న హీరో ఆనందకుమార్, హీరోయిన్ ఆనందవాణి అకస్మాత్తుగా రాత్రికి రాత్రే ప్రత్యర్థులుగా, విరోధులుగా అవుతున్నారంటే చాలా బాధగా వుంటోంది. సినిమా ఫీల్డు నైజం ఇంతేనేమో. ఇదీ సినీమాయ అంటావా? ఇంకేదయినా అంటావా? జవాబు తెలిసీ చెప్పకపోతే నీ తలవెయ్యి వక్కలయి నామినేషన్ల ఆఫీసులో పడుతుంది." భేతాళుడు హెచ్చరించాడు.

చిరునవ్వులు చిందించాడు విక్రమార్కుడు. వంశపారంపర్యంగా మహారాజుల సంతతికి చెందిన వాడైనా, విక్రమార్కుడికి ఈ రాజకీయాలు, కక్షలు, ఆవేశాలు కొత్తేమీ కాదు. ఈ మధ్య కాలంలో మరీమరీ ఎన్నికలగురించే విక్రమార్కుడికి ఆనంద కుమార్, ఆనందవాణి కథాకమామీషు కొట్టిన పిండి.

"భేతాళా! నీవు చాలా పసివాడివిలా వున్నావ్! మరీ ఇన్నోసెంట్ అయితే ఎలా? ఆనందకుమార్, ఆనందవాణిల ఎన్నికల కార్యక్రమాల్లో వింత ఏమీలేదు. కొత్త ఏమీ లేదు. నిజానికి వారిది ఒక ప్రేమజంట, ఆదర్శజంట. వెండితెరపై కానరాని ఆత్మీయత, అనుబంధం వారిని పెనవేశాయి. అందువల్లనే ఇరవై ఏళ్ల వైవాహిక జీవితంలో ఎక్కడా వెంట్రుకవాసి తేడాకూడా రాలేదు. అయితే ఈ ఎన్నికల్లో జరిగిన సెన్సేషన్ ఏమిటంటావా? నువ్వు మరిచి పోయావా? ఆనందవాణి మీద నెలరోజులక్రితమే ఇన్‌కంటాక్స్ రెయిడ్ జరిగింది, గుర్తుందా? ఆ దాడి తాలూకు వ్యవహారం అంతా అలాగే వుంది. వేసిన సీళ్లు వేసినట్లే వున్నా యి. లాకర్లు స్తంభించిపోయాయి. పైగా ఎన్నికల వాతావరణంలో మార్పు వచ్చింది. ఆనందకుమార్ పార్టీవారు స్కాములతోను, కుంభకోణాలతోను భ్రష్టుపట్టారు. ఈ దశలో అపొజిషన్ పార్టీకి మంచి అవకాశాలు కనిపిస్తున్నాయి. వాళ్లే అధికారంలోకి రావచ్చు. వాళ్లను కనిపెట్టుకుని వుంటే ఆనందవాణి ఆదాయపు పన్ను సమస్యలన్నీ ఎక్కడివక్కడ పటాపంచలు అవుతాయి. అలాకాకుండా అధికార పక్షంవాళ్లు గెలిచినా ఆనందవాణిని కాపాడేందుకు భర్త ఆనందకుమార్ వుండనే వున్నాడు. ఎలా వుండి ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చినా ఇద్దరూ చాలాసేఫ్. అందుకే మొగుడు- పెళ్లాం ఇద్దరూ రాత్రికి రాత్రికి ఆడిన నాటకమే ఈ ఎలక్షన్లు, పోటీలు, నామినేషన్లు. ఇందులో ఆనందవాణిది పన్ను పోటేగాని వెన్నుపోటుగాదు. ఈ తతంగానికి సినీరంగాన్ని తప్పుపట్టాలేం-" విక్రమార్కుడు రాజకీయ చాతుర్యం విరజిమ్మాడు.

భేతాళుడి కథ మామూలే. రాజుగారికి మౌనభంగం, భేతాళుడు శవంతోసహా యాయం కావటం-

అక్కడ ఆనందకుమార్, ఆనందవాణి ఒకరిమీద మరొకరు కయ్యానికి కాలు దువ్వుతున్నారు. పబ్లిక్‌గా స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. పత్రికల్లో ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారు. టీ.వి.లు బద్దలయి మార్మోగుతున్నాయి.

ఇక జనం అంటారా 'పిచ్చోళ్లు'. అటు కొందరూ, ఇటు కొందరూ!

చీకటి పడితే హీరోహీరోయిన్లు మాత్రం ఒకే కంచం, ఒకే....